క్లుప్తంగా

జాతీయ జెండా ఆవిష్కరణ




వనపర్తిటౌన్: పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెలలో చివరి ఆదివారం కాంగ్రెస్ కార్యాలయం ఎదురుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం డీసీసీ కార్యాలయం ఎదురుగా సేవాదళ్ ఆధ్వర్యంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు జానకీరాములు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చీర్ల జనార్దన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కదిరె రాములు, కోట్ల రవి, సమద్, ఎండీ బాబా, అబ్దుల్లా, గద్దం వినోద్, వెంకటేశ్వర్‌రెడ్డి, ఇర్షాద్, సురేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి



ఆత్మకూర్: పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలు మితిమీరిపోతున్నాయని, దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు పిరికిపందల చర్యలకు పాల్పడుతున్నారని స్వర్ణసహకార సంఘం రాష్ట్రనాయకుడు బంగారు భాస్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద మృతులకు సంఘీభావంగా మౌనం పాటించి, నివాళులర్పించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా కేంద్రం కఠినమైన చర్యలు తీసుకోవాలని, దెబ్బకు దెబ్బ తీసి పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంగారు ప్రకాష్, నరేష్, డీకే ప్రకాష్, బాలరాజు, శ్రీధర్, భాస్కర్, నరహరి, శివ, తరుణ్, సతీష్, మురళి, మహేష్, రఘు, మణి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా మోడల్ పాఠశాల అర్హత పరీక్ష



ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా స్టేజీ సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. ఆదివారం ఉదయం జరిగిన 5వ తరగతి అర్హత పరీక్షకు 80 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 60 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం నుంచి నిర్వహించిన 6 నుంచి 10వ తరగతి అర్హత పరీక్షకు 31 మంది దరఖాస్తు చేసుకోగా 23 మంది హాజరైనట్లు ఆమె చెప్పారు.

కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల అమడబాకుల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశం, 7, 8, 9, 10వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం నిర్వహించిన అర్హత పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జున్‌గౌడ్ తెలిపారు. 6వ తరగతిలో అర్హతకు 295మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 238మంది విద్యార్థులు హాజరయ్యారు. 7, 8, 9, 10వ తరగతిలో ప్రవేశం కోసం 217మందికి గానూ 165మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

మే డే ఉత్సవాలు జయప్రదం చేయాలి

వనపర్తి రూరల్: 139వ మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఎదుట వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో కార్మిక హక్కులు సాధించుకున్న సందర్భంగా మే డే ఉత్సవాలను నిర్వహించుకుంటారన్నారు. కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న హక్కులను ఈ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మికులు అందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గోపాలకృష్ణ, రమేష్, ఎర్ర కురుమయ్య, చిన్న కురుమయ్య, గంధం శ్రీనివాసులు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



కలగానే 'డిగ్రీ కళాశాల'

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న 'ఖిల్లా' ప్రజలు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు



ఖిల్లాఘనపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అధికారులు గుర్తించిన ప్రభుత్వ స్థలం

ఖిల్లాఘనపురం: మండలంలోని పల్లెల్లో కాయకష్టం చేసుకుని జీవించే కుటుంబాల్లో జన్మించిన నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. గ్రామాలు, మండల కేంద్రం వరకు ఎలాగో వెళ్లి ఇంటర్ వరకు చదివినా.. ఉన్నత చదువుల కోసం పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. ఖిల్లాఘనపురం మండలానికి మూడు వైపులా ఉన్న మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాలకు చేరుకోవాలంటే 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే. పేదరికం కారణంగా అంత దూరం వెళ్లలేని పరిస్థితి. చేసేది లేక ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు.

నీటిపై రాతలుగానే..

పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేస్తున్నట్లు నేతలు ఇచ్చే హామీలు నీటి మీద రాతలుగానే మిగులుతున్నాయి. కళాశాలకు కావాల్సిన భూమిని అందుబాటులో ఉందని చెబుతున్నా.. ఏర్పాటు దిశగా ఎందుకు అడుగులు పడట్లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అమ్మాయిలకు ఆటంకమే..

స్థానికంగా డిగ్రీ కళాశాల లేకపోవడంతో మండలానికి చెందిన అమ్మాయిలు ఇంటర్ తోనే చదువు స్వస్తి చెబుతున్నారు. డిగ్రీ చదవాలంటే వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండడంతో అమ్మాయిలను రోజూ అంతదూరం పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడంలేదు. దీంతో చిన్న వయస్సులోనే వారికి పెళ్లిళ్లు చేస్తున్నారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని సుమారు పదేళ్ల క్రితం కొందరు అధికారులు వచ్చి ఇంటర్ కళాశాలను పరిశీలించారు. నూతన భవనాలు నిర్మాణం జరిగే వరకు ఇంటర్ కళాశాలలోనే తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల నిర్మాణానికి పోలీస్‌స్టేషన్ వెనకాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు చెప్పారు. కానీ ఇప్పటికి వరకు ఎలాంటి పనులు జరగలేదు.

వందల మంది..

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటుగా దొంతికుంటతండా సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ కళాశాలలో ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారు. కానీ డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడం, పెద్ద పట్టణాల్లో చదువు భారం కావడంతో మండల యువత హైదరాబాద్‌కు ఉపాధి కోసం వలస వెళ్తున్నారు.

కళాశాల ఏర్పాటుచేయాలి



ఖిల్లాఘనపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఉంటే నా లాంటి నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదులువులు చదివే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి.

– మౌనిక, తెలంగాణ మోడల్ కళాశాల, ఖిల్లాఘనపురం

ఎన్నికల హామీగానే..



మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రతి సారి ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలు ఇస్తున్నారు. ఎన్నికల పూర్తి కాగానే పక్కకు పెడుతున్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు అనేది కేవలం నాయకులకు ఎన్నికల సమయంలో ఇచ్చే హామీగానే మిగిలిపోయింది. హామీలు ఇవ్వడం కాదు పేదవిద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యం ఉంటే కనీసం ఇప్పుడైన ప్రజా ప్రతినిధులు ఆ దిశగా అడుగులు వేయాలి.

– దాసర్ల భూమయ్య, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, ఖిల్లాఘనపురం

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న తాపీ కార్మికులు

కొత్తకోట రూరల్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ఆదివారం కొత్తకోట పట్టణ కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూలంగా అమలు చేస్తుందన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వందేళ్లలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులన్నింటినీ బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కుంతుదని, కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బరితెగించి కార్మికుల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో వెంకటయ్య, శ్రీను, ఆస్కాని శ్రీనివాసులు, ఆంజనేయులు, పి.వెంకటేష్, డి.ఆశన్న, చిన్న రాములు, పి.జనార్దన్, పి.కురుమూర్తి, నరేష్, రాజు ఉన్నారు.

విద్యుదాఘాతంలో గేదె మృతి

గోపాల్‌పేట: తెగిపడిన విద్యుత్ వైర్లను తొక్కడంతో రెండు గేదెలు విద్యుదాఘాతానికి గురై.. ఒక గేదె మృతి చెందింది. గ్రామస్తుల కథనం మేరకు.. తాడిపర్తికి చెందిన బోయిని మహేష్ తన రెండు గేదెలను మేపుతుండగా అవి విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఒక గేదె ప్రమాదం నుంచి బయటపడగా.. మరో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారుల వల్లే గేదె చనిపోయిందని, దాని విలువ రూ.80వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

అఖండ ధ్యానంతో అద్భుతాలు సాధించొచ్చు



శివ కేశవ పిరమిడ్ వ్యవస్థాపకురాలు గోర్ల కమలమ్మను సన్మానిస్తున్న ధ్యానులు

వనపర్తిటౌన్: మానసిక, అశాంతి, అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ధ్యానమే దివ్య ఔషధమని శివకేశవ పిరమిడ్ ధ్యాన మందిర వ్యవస్థాపకురాలు గోర్ల కమలమ్మ అన్నారు. 2011 ఏప్రిల్ 15వ తేదీన జిల్లా కేంద్రంలోని పాతకోట శివాలయంలో శివకేశవ పిరమిడ్ ధ్యాన మందిరంతో ప్రతి ఆదివారం, అమవాస్య, పౌర్ణమి రోజు ధ్యానంపై అవగాహన కల్పిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వర్తించడంలో 14 ఏళ్లు పూర్తయిందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాతకోట శివాలయంలో శివకేశవ ఆలయ కమిటీ సభ్యులు గోర్ల కమలమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ ధ్యానం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అఖండ ధ్యానానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఏళ్ల తరబడి ధ్యాన శిక్షణకు, అన్నదానానికి గోపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వసంత పూరి, చంద్రకళ, తిరుపతమ్మ, వెంకటేశ్వర్ తదితరులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో వాసవి సేవా సమితి జాతీయ నాయకుడు పూరి సురేష్‌శెట్టి, శివకేశవ ఆలయ కమిటీ ప్రతినిధులు ఈశ్వరమ్మ, జ్యోతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాన్‌గల్: శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక' జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కొత్తపేటలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. యోగీశ్వరులు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి, వారి జీవితంలో జ్ఞానమార్గం అనుసరించాలని కోరారు. పౌర్ణమి అనేది పూర్ణ దైవ జ్ఞానానికి గుర్తుగా ఉంటుంది కాబట్టి అజ్ఞానం నుంచి వెలుగు వైపు ప్రయాణించాలన్నారు. అమవాస్య, పౌర్ణమికి మధ్యలో అష్టమి తిథి రోజున శ్రీకృష్ణుడు జన్మించి జ్ఞానం, అజ్ఞానానికి మధ్యలో వారధిలా కనిపిస్తున్నాడు. శ్రీకృష్ణుడిని, భగవద్గీతను విశ్వశించకపోతే అమవాస్య వైపు నడిచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, సభ్యులు సురేష్‌కుమార్, బద్రీనాథ్, కృష్ణయ్య, లలితమ్మ, స్వరూప, నాగరత్నం, లలిత, శివమ్మ, అలివేలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహిళ అదృశ్యం



వనపర్తి రూరల్: చిట్యాల రోడ్డులోని డబుల్ బెడ్ రూం కాలనీకి చెందిన రాత్లావత్ భాగ్యలక్ష్మి ఈ నెల 26 నుంచి కనిపించడం లేదని భర్త రాత్లావత్ దేవదాస్‌నాయక్ ఆదివారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. డబుల్ బెడ్ కాలనీ చెందిన రాత్లావత్ భాగ్యలక్ష్మి ఈ నెల 26న ఉదయం కూలీ పనికి ఇంటి నుంచి వెళ్లి.. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త రాత్లావత్ దేవదాస్‌నాయక్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వరంగల్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



పెద్దగూడెం నుంచి వరంగల్ సభకు బయలు దేరుతున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ జిల్లాలో అన్ని గ్రామాలు నాయకులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పాలనలో ఘోరంగా విఫలమైందని ఎద్దేవా చేశారు. అందుకే ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలివస్తున్నారన్నారు.

- ఆత్మకూర్ నుంచి మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో 30 ప్రత్యేక వాహనాలు, ఆరు ఆర్టీసీ బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు వరంగల్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు శ్రీధర్‌గౌడ్, బంగారు శ్రీనివాసులు, విరేశలింగం, నాయకులు మండ్లరామకృష్ణ, కోటేష్, లక్ష్మణ్, రియాజ్, మాసన్న, భరత్‌రెడ్డి, హాశం, కర్రె శ్రీను, అజ్జర్, దేవేంద్రం, షరీఫ్, భరత్‌రెడ్డి, సోంబాబు, జానకీరాం, శేఖర్ తదితరులు ఉన్నారు.
- వనపర్తి, శ్రీరంగాపురం, పెబ్బేరు మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అనంతరం వరంగల్‌కు బయలుదేరారు.
- ఖిల్లాఘనపురం మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు పార్టీ జెండాలను ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్ ఆధ్వర్యంలో నాయకులు వరంగల్‌కు తరలి వెళ్లారు.
- అమరచింత మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు వరంగల్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో రమేష్ ముదిరాజ్, ఎస్‌ఏ రాజు, నరసింహులు గౌడ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని బీఆర్ఎస్ వీపనగండ్ల మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్ అన్నారు. వరంగల్ సభకు మాజీ సర్పంచ్‌లు అంజయ్యనాయక్, రామేశ్వర్‌రావు, రఘునాథ్‌రెడ్డి, నాయకులు ఎద్దుల సురేందర్‌రెడ్డి, శివయాదవ్, సర్దార్ తదితరులు తరలివెళ్లారు.



చిక్కేపల్లి నుంచి..

- పాన్‌గల్ మండలంలోని 28 గ్రామ పంచాయతీల నుంచి వరంగల్ సభకు 3 ఆర్టీసీ బస్సులు, 17 తుఫాన్ వాహనాలు, 27 కార్లల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో వరంగల్‌కు తరలివెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



కొత్తపేటలో ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కొత్తపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కురుమూర్తి తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొత్తపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందన్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫామ్స్, పాఠ్య, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రాగి జావ, ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు కంటి అద్దాలు అందిస్తున్నట్లు ఆయన తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు తల్లిదండ్రులు సహకారం అందించాలన్నారు.

పాత్రికేయుల సంక్షేమమే ప్రెస్‌క్లబ్ ఎజెండా



ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సీనియర్ జర్నలిస్టులు

గోపాల్‌పేట: పాత్రికేయుల సంక్షేమమే ధ్యేయంగా ప్రెస్‌క్లబ్ పాలకవర్గం పనిచేయాలని సీనియర్ జర్నలిస్టు రవీందర్‌రెడ్డి సూచించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన ప్రెస్‌క్లబ్ కమిటీని వనపర్తి జిల్లా వర్కింగ్ జర్నలిస్టులు ఆదివారం మండలంలో కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో సన్మానించారు. రాజకీయాలకు అతీతంగా జర్నలిస్టులు ప్రజా సంక్షేమానికి పనిచేయాలని సూచించారు. అందరూ కలిసి ప్రతినెలా చిన్నమొత్తంలో పొదుపు చేసుకోవాలని, బ్యాంక్ ఖాతా ఓపెన్ చేసి అందులో డబ్బు దాచుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఎవరైనా ఇబ్బందులకు గురైనప్పుడు అవి ఆసరాగా ఉంటాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో బోలెమోని రమేష్, వివిధ పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు లక్ష్మణ్, రాము, ఖలీల్, సీనియర్ జర్నలిస్టులు దినేష్, కుమార్, రాజు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల ఇబ్బందులు



పాన్‌గల్ ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

పాన్‌గల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15 రోజులైనా ధాన్యం కాంటా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క ఆకాశంలో మబ్బులు, ఈదురు గాలులతో ధాన్యం కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోతున్నారు. హమాలీలు, తేమ శాతం, గన్నీ బ్యాగులు రాలేదనే సాకులు చెబుతూ ధాన్యం కాంటా చేయకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మగ్గిపోతుంది. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సింగిల్ విండో ఆధ్వర్యంలో 23 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. ప్రస్తుతం 6 కేంద్రాల్లోనే ధాన్యం సేకరణ సాగుతుంది. మిగతా వాటిలో ధాన్యం కాంటా చేయడం లేదు. ఐకేపీ ఆధ్వర్యంలో 9 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిచగా.. 4 కేంద్రాల్లోనే కాంటా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కాంటా చేసి ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఐకేపీ ఏపీఎం వెంకటేష్‌యాదవ్‌ను వివరణ కోరగా.. కొన్ని కేంద్రాల్లో తేమ శాతం రాకపోవడం, మరికొన్ని కేంద్రాల్లో హమాలీల కొరతతో సేకరణలో ఇబ్బంది ఎదురవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కోటిలింగేశ్వర ఆలయంలో రుద్రహోమం



దత్తకోటిలింగేశ్వర ఆలయంలో సహస్రనామ స్తోత్రపారాయణం చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి సమీపంలో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమవాస్య సందర్భంగా రుద్రహోమం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణకవచ పంచలోహ శివలింగం వద్ద లోకకల్యాణార్థం రుద్రహోమం, లలితా సహస్రనామ స్తోత్రపారాయణం వైభవంగా జరిగింది. ఆలయానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి లలితా సహస్రనామ స్తోత్రపారాయణం చేయగా అర్చకులు వేదమంత్రాలతో హోమక్రతువు పూర్తి చేసి పూర్ణాహుతి సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



ఖిల్లాఘనపురం వీరన్నగుట్ట వద్ద..

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురం గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకుడు నవీన్‌కుమార్ శర్మ ఉదయం స్వామి వారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహామంగళ హారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌స్వామి, రమేష్‌శర్మ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి గుట్టపై ఉన్న దేవాలయంలో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదానం చేశారు.

అభివృద్ధి, సంక్షేమం చూసే చేరికలు



కొత్తకోట రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కనిమెట్ట గ్రామానికి చెందిన దాదాపు 100మందికి పైగా బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఆ దిశగా ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, పి.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎస్‌జే బోయేజ్, బీచుపల్లియాదవ్, కృపాకర్ రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాంద్‌పాష తెలిపారు. మండలంలోని జూరాల రైతువేదికలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి హాజరవుతున్నారన్నారు. మండలంలోని రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

అమరచింత: భూ భారతి చట్టం గురించి రైతులకు అవగాహన కల్పించేందుకు సోమవారం నాగల్‌కద్మూర్‌లోని రైతువేదికలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవి కుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్‌సురభి హాజరవుతున్నరని తెలిపారు.